# 2

# బయట చినుకులు పడుతున్నాయి...

**ఆఫీసు నుంచి** వచ్చి రామారావు 'హమ్మయ్య' అంటూ కుర్చీలో కూలబడ్డాడు. లోపలినుంచి సరోజిని వచ్చి ఓసారి పరికించి పోయింది అతణ్ణి. వేషం వూడదీసి, కాస్త ముఖమూ చేతులూ కడుక్కునేసరికి పది నిమిషాలు పట్టింది రామారావుకి. అత నిప్పుడు బజారుకి వెళ్ళాలి. ఒక ప్రాణస్నేహితుణ్ణి ఫలాని చోట తనకోసం తప్పక ఎదురుచూడమని చెప్పివచ్చాడు రామారావు, ఆఫీసునుంచి వచ్చేటప్పుడు. అంచేత హడావుడిగా కాఫీ తాగాడు. దువ్వెకునీ దువ్వకోనట్టుగా జుట్టు సరిచేసుకున్నాడు. అతని వాలకం చూస్తే సరోజినికి కోపం వచ్చింది. ఒక్కరోజైనా యీయనగారు నిశ్చింతగా వుంటారేమో! తనని ఏ పార్కుకో, సినిమాకో తీసుకువెళతారేమో నని ఇదివరలో ఆశపడేది పాపం, ఆ ముద్దరాలు. "కాని, ఏదీ! క్షణం తీరిక వుండదు, పరిగెత్తిపోవటమే! ఏమిటో ఆ చేసే నిర్వాకం,ఆఫీసు విడిచిపెట్టిన తర్వాత. పెద్ద....! ప్రపంచాన్నంతా ఉద్ధరిస్తున్నట్లు" ఇవి సరోజిని పెదవిదాటని మాటలు సుమండీ!

ఇవాళకూడా సరోజినికి కోపం వచ్చి ముఖం ముడుచుకుంది. అతడు చూడలేదు. తనూ చూడలేదు. ఒక ముద్దూ—ముచ్చటా—ఏమైనా కాబడితేగదా!

రామారావు హాల్లోనుంచి వరండాలోకి వస్తూ, సగం హాల్లోనూ, సగం వరండాలోంచీ పలికినట్లుగా "రాత్రి పొద్దుపోతుం దేమో నేను ఇంటికి వచ్చేసరికి! నువ్వు నాకోసం కనిపెట్టుకోవద్దు.

ఖోంచెయ్. నిద్రకూడా పో. ఎటుజేసీ నేను పిలిచినప్పుడు మాత్రం తలుపు కొంచెం తియ్యి," అని పోబోతూ తన తెలివికి తానే సంతో షిస్తూ ముందు కడుగు వేస్తున్నాడు. 'ఇదంతా హాస్యమనుకుంటారు కాబోలు యీన' అని విసుక్కుంది సరోజిని.

కాని రామారావు వీథివాకిలి దాటలేదు. వెంటనే లోనికి వచ్చే శాడు. ఒక్కక్షణంలో సగంలోనే భూమినికూడా కోసుకుపోతూ కిందికి దిగేంత వేగంతో వాన కురవడం ఆరంభమైంది. ఎక్కడి నుంచి వచ్చాయో ఈ మబ్బులు, కోపంతోనూ, పౌరుషంతోనూ చెదరిపోయిన ఏనుగుల గుంపులాగా వచ్చిపడ్డాయి. నల్లని మబ్బులు! 'తొండాల్లోంచి చిమ్ముతున్నట్లుగా ఈ వాన ఒకటి' విసుక్కున్నాడు రామారావు. ఇంట్లోకి వచ్చాడు, విసుగుతో. పరిపరివిధాల ఆలోచన లతో వరండాలో కుర్చీలో కూర్చున్నాడు.

'గొడుగు వేసుకుని వెళితే—'అనుకున్నాడు. కాని గొడుగులు నిలిచేట్లుగాలేవు. ఆకాశంలో ఎవరో బాణాసంచా పేలుస్తున్నారు. బంగారపు విండ్లు విరిచి పారేస్తున్నారు. ఏం చెయ్యాల్సిందీ తోచ లేదు, రామారావుకి. విసుగ్గావుంది. వాన ఇప్పుడప్పుడే నిలిచేట్లుగా లేదు! గొడుగువేసుకుని పోదామనుకున్నాడు. కాసేపు తటపటాయిం చాడు. ఇప్పుడు తాను ఇలా వీథిలోకి వెళితే ఈ సరోజినమ్మగారు— ఆరాలు మొదలుపెడుతుంది నిలబెట్టి. గొడుగు గుర్తు రాగానే లోపల వుండబట్టలేనట్లుగా అతడి పెదవులమీదికి చిరునవ్వు తోసుకుని వచ్చింది. ముఖమంతా తృప్తి నిండిపోయింది. సంతోషమంతా వచ్చి పెదవులమీదనే నిలిచిపోయింది. అప్పుడు చూశాడు, కిటికీలోంచి గోడవారగా—విరబూచిన సంధ్యమల్లెపూలను. జల్లు పడుతున్నదే కాని ఆ పువ్వులమీద వాన కురియడంలేదు. 'వర్షాకాలపు సాయం కాలాలు ఎంత అందంగా ఉంటాయి' అనుకున్నాడు. అప్పుడు గుర్తుకు వచ్చాయి, చిన్ననాటి సాయంకాలాలు. అమ్మ అరుస్తూవున్నా చెట్లెక్కడం; తోట్లలో చామంతిపూలు పూయడం; వాన కురిసి వెల సిన తరవాత విచ్చిన బీరపూలను చూసి పులకరించిపోవడం; దానిమ్మచెట్టుక్రింద కూచుని తలంట్లు పోసుకోవడం, అక్కయ్యా

ఆమె కూతురూ, వాళ్ళ కష్టాలూ, ఓదార్పులూ—ఒక్కొక్కటీ అన్నీ అప్పుడు గుర్తు వచ్చినయ్.

పెదవులమీద సంతోషం యింకా చెదరిపోనూలేదు. అప్పుడు వచ్చింది సరోజిని. చూసింది. ఆశ్చర్యపోయింది. కళ్లు విప్పార్చుకుని చూసింది. మనసులో ముక్కుమీద వేలేసుకుని! దగ్గరగా వచ్చింది. అతడి పెదవులమీద సంతోషం అలానే వుంది.

"పాపం! ఇవాళ ఆ రోడ్లన్నీ ఎంత బోసిపోతాయో!" అన్నది. 'ఏ' మన్నట్లు చూశాడు.

"నిజంగా నాకు చాలా విచారంగావుంది,ఆ వీథులను తలచుకుం టూంటే!...." అర్థం కాలేదన్నట్టు చూశాడు రామారావు.

"పాపం, వాటి పొడవు ఇవాళ ఎవరు కొలుస్తారు?" రామా రావుకి కోపం వచ్చింది!

"చాల్చాల్లే—నేర్చుకుని పోయావు! నేను పనీ పాటా లేకుండా వీధులన్నీ తిరిగి వస్తాననేగా నీ వుద్దేశం?" అని అడగనూ అడిగాడు.

"మరేం!" అని వెక్కిరించింది సరోజిని.

"నీకో కథ చెపుతాను కూచో" అన్నాడు రామారావు వుత్సా హంగా. సరోజినికి కథలంటే ఎంతో ఇష్టం. రెండు వారపత్రికలు అరగంటలో చదివి అవతల పారేస్తుంది. రామారావు మాటల్లో కొంచెం అతిశయోక్తి కావచ్చు. ఆ సంగతి రామారావుకి తెలీదు. సరోజినికి మల్లెపూల చెండు పెట్టి కొట్టినట్లయింది. "ఈయన తనకి కథ చెప్పటమా! సాయంకాలం ఆరుగంట లప్పుడు తనని దగ్గరగా కూచోపెట్టుకోవటమూనా!...." 'చెప్పరూ' అన్నట్లుగా కూచుంది సరోజిని. రామారావు మొదలుపెట్టాడు. 'మధ్యలో లేచిపోకూడదు.' అదీ షరతు. ఆమెవేపు,వాన వెలిసినా తానుకూడా ఇవాల్టి కింక వీథి ముఖం చూడడు—అని, తను "మా వూళ్ళో ఓ అమ్మాయుంది. నీకు తెలీదు లే. వాళ్ళ మామయ్య నాకు తెలుసు. మంచివాడు. చాలా మంచివాడు. ఆ అమ్మాయికూడా వాళ్ళ ఇంట్లోనే వుంటోంది. ఎందు కేనా వచ్చిందో, మరి అక్కడే వుంటుందో! ఓరోజు యిలానే వాన

వచ్చింది. కాసేపుండి వెలిసింది. అప్పుడు ఆ మామయ్య పాత గొడుగు పట్టుకుని (మళ్ళీ వాన వస్తుందేమో నన్న భయంచేత) వీధి లోకి బయలుదేరాడు. బీరపూలు పూసివున్నాయి. వాన కురిసి వెలిసిన తరవాత సాయంకాలపు వింత కాంతులు బీరపందిరిపై ప్రాకుతున్నై. మామయ్య వీధి వాకిలి దాటుతున్న వా డల్లా, గొడుగు దేన్నో పట్టు కుని తనని ఆపుతున్నదని. చప్పున వాకిట్లోనే నిలబడిపోయి వెనక్కి చూశాడు. గొడుగుకాదు తను ఆపింది. ఆ అమ్మాయి....అప్పుడేం జరిగిందో తెలుసా? ఆ అమ్మాయి కళ్ళు అతణ్ణి తనని పెళ్ళి చేసుకో మని అడిగాయి. అడిగాయే కాదు, ప్రార్థించాయి. ప్రార్థించటమే కాదు....ఆజ్ఞాపించాయి. ఆ కళ్ళను కాదనలేకపోయాడు. సరోజిని నవ్వు దాచుకోలేకపోయింది, ఈన కవిత్వానికి! లేచి వెళ్ళిపో బోయింది. చెయ్యి పట్టుకుని ఆపేశాడు.

"ఇదిగో మధ్యలో లేచిపోతున్నావు. నే నొప్పను. మన షరతు...." అంటూ గుర్తు చేశాడు.

"చాల్లెండి, నేర్చుకునిపోయారు! ఇప్పు డేమో మహా కష్ట పడిపోతున్నట్లు! ఎవరైనా వింటే నవ్విపోతారు!" అని హేళనగానూ, "ఏమండీ! చెప్పరు; నన్ను చేసుకుని మీరు మహారాజులా లేరూ?" అని గారాబంగానూ సరోజిని అడిగింది. కూర్చుండిపోయింది. ఒక్క క్షణంలోనే రామారావు కళ్ళలో ఆమెకు భగవంతుడు కనిపించాడు. ఆమె ఎంతో ఆశ్చర్యపడిపోయింది. రామారావుని ఆ రూపంలో ఎప్పుడూ చూడలేదు ఆమె. అంత అమాయకంగా, అంత తన్మయు డుగా,ముగ్ధుడుగా యిదివరలో చాలా తక్కువ సార్లు చూసింది అతణ్ణి.

"ఇదేం కథ? ఇంకోటి చెబుతాను."

"ఊఁ!...."

"నాకు వర్షమంటే ఎంత యిష్టమో నీకు తెలుసునా?"

"ఎందుకూ!" ఎంతో ప్రేమతో!

"చెపుతాను విను మరీ...ఎందుకంటే—సర్వ సారభూత మైన వేదాంతం చెప్పేది అదేకదా. అందరికీ వర్షమే ప్రాణా న్నిస్తున్నదని.ఆ విషయం నాకు సరిగ్గా తెలీదులే. ఎవరో—ఎక్కడో

చెబుతూండగా విన్నాను. అదిపోనీ—మా ఊళ్ళోనే నాకు తెలిసిన ఓ అమ్మ వుంది. ఆమెకు ఓ కొడుకు పుట్టాడు. (సరోజిని కిలకిలా నవ్వింది) అయ్యో!....నా తెలివి తెల్లవారా!ఆమెకు కొడుకు పుట్టాడు. ఆమె 'అమ్మ' (అయింది)....వాణ్ణి 'నా బంగారుకొండా—నా కన్నయ్యా—నా చీకటి దీపమా-నా తండ్రీ' అనుకునేది, ఎప్పుడూ క్షణమైనా తీరిక లేకుండా. 'పాలకడలి త్రచ్చగా వచ్చిన అమృతమే వీడు' అనుకుంది. తాను లక్ష్మి, పార్వతీ, సరస్వతులకంటేనూ అదృష్టవంతురాలనుకొంది. తన కొడుకుని ఏ అమ్మ అనుకోదని? అయితే ఆ పిల్లాడికి ఓసారి పెద్ద జబ్బుచేసింది, మూడేళ్ళప్పుడు. నయం కాకపోగా యెక్కువయింది. రోజు రోజుకీ ఎక్కువయింది. ఆ అమ్మ ముఖం వాడిపోయింది. ఇరుగూ-పొరుగూ ఆ పిల్లాడు బ్రతకడన్నారు. ఆమె ఏడ్చింది. ఆ పిల్లాడికి మరీ జబ్బు ఎక్కువయింది. ఆ పిల్లాడి నాన్న ముఖం పక్కకు తిప్పుకున్నాడు, చూడలేక. చీకటిపడుతూంది. పిల్లాడు హాల్లోంచి వరండాలోకి వచ్చాడు. ఇరుగూ పొరుగూ వచ్చారు. పిల్లాడు మళ్ళీ హాల్లోకి వెళ్ళడన్నారు. పిల్లాడు పోయాడని నలుగురూ తీర్మానం చేశారు. అమ్మ ఏడుస్తూనే వుంది. పిల్లాడు పోయాడనే అనుకున్నారు. పెద్దలూ చిన్నలూ, పిల్లలూ పాపలూ, అందరూ పోయి ఎక్కడికిపోతారో అక్కడికే ఆ పిల్లాణ్ణి పంపించిరావాలి ఇక. హాలులేదు. వరండాలేదు—

"అప్పుడేం జరిగిందో తెలుసా? వాన వచ్చింది. పెద్దవాన వచ్చింది. జోరున, హోరున,ఛోరున గంట కురిసింది. రెండు గంటలు కురిసింది. వాన వచ్చింది. పెద్దవాన వచ్చింది—

"అప్పుడేం జరిగిందో తెలుసా? అమ్మ ఒళ్ళో పిల్లాడు కదిలాడు. అమ్మ ఆనందం ఏమని చెప్పను! అలానే రాకపోతే........ అప్పుడేం జరిగిందో తెలుసా! ఆ పిల్లాడు పెరిగి పెద్దవాడైనాడు.... అందుకే వర్షమంటే నాకు చాలా యిష్టం...." రామారావు కథ ముగించాడు.

విచిత్రం! సరోజిని ఏడుస్తోంది.

———